## క్లుప్తంగా

### ముగిసిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు



ట్రోఫీతో విజేత జట్టు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి వేణుగోపాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల సందర్భంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల గ్రామస్తులందరికీ ఆహ్లాదం, వినోదంతో పాటు క్రీడాస్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో బొడ్డు రమణ, వియ్యపు నాని, గొలగాని సోమునాయుడు, కోమటి రమాదేవి, ఈసరపు అప్పలనాయుడు, దేవర తాతారావు, ఈసరపు అప్పలరాజు, చొప్పా శ్రీను, కదుపుట్ల శ్రీను, ప్రగడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ఆలయ అర్చకులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఈకే చారి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఏటా ధనుర్మాసం ముగిసిన తరువాత ముక్కనుమ రోజున బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో భక్తులు పాల్గొన్నారు.

### సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



జీవీఎంసీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు

అగనంపూడి: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. 88వ వార్డు దువ్వాడ పరిధిలోని దుకాణాల్లో దాడులు నిర్వహించిన సిబ్బంది 50 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాలు స్వాధీనం చేసుకొని జీవీఎంసీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నందున వ్యాపారులు వినియోంచవద్దని, వినియోగదారులు నార, గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు.

### గంజాయితో పాత నేరస్తుడి అరెస్టు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం గంజాయితో సంచరిస్తున్న పాత నేరస్తుడిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేసి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం 87వ వార్డు లక్ష్మీపురం కాలనీకి చెందిన ఎలుగుబంటి ఆనంద్ వెంకట కుమార్ అరకులో గుర్తు తెలియని వ్యక్తి వద్ద రెండు కేజీల గంజాయి కొనుగోలు చేసి సంక్రాంతి సందర్భంగా అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుందామనుకున్నాడు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఎదురుగా నాగదేవత కొండ వద్దకు రాగా అతని బ్యాగ్‌ను తనిఖీ చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో అతను పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతన్ని పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఆనంద్‌కుమార్ కుటుంబ అవసరాలు, చెడు అలవాట్లకు బానిసై ఈ చర్యకు పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. అతను గతంలో ఒక, గంజాయి కేసులో కూడా జైల్లో ఉండి వచ్చినట్టు, నాలుగేళ్ల నుంచి అతనిపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని అంగీకరించినట్టు ఎస్ఐ తెలిపారు.



# నందనవనం

- ఇంటి పైభాగంలో పండ్లు, పూలు, ఔషధ మొక్కల పెంపకం
- ఇద్దరు గృహిణుల వినూత్న అభిరుచి
- చుట్టుపక్కల వారికి ఫలసాయం అందజేత



స్వీట్ లెమన్



నల్ల వంకాయ



బర్మా కాలనీలో మేడ మీద పంట



డ్రాగన్ ఫ్రూట్, ఔషధ మొక్కలు



సపోట



కాలీఫ్లవర్

పెదగంట్యాడ: ఆ మేడపైకి వెళ్తే ఔషధ మొక్కలు ఆహా అనిపిస్తాయి. పూల పరిమళాలు సాదరంగా స్వాగతం పలుకుతాయి. వంటకు మేం సిద్ధం అంటూ తాజా కూరగాయలు.. పోషక విలువలు పెంచే పండ్లు పలకరిస్తాయి. ఇవన్నీ ఎక్కడో పల్లెటూళ్లో పొలాల్లో పండించే పంటలు కాదు. మండలంలోని నెల్లిముక్కులో కాగా మరొకటి బర్మా కాలనీలో మేడపై. మామూలుగా పంటలు పండించాలంటే సారవంతమైన నేల కావాలి. అందుకు అవసరమైన ఎరువులు.. కావాల్సినంత నీరు ఉండాలి. ఇవేవీ లేకున్నా.. ఇంటి పైభాగాన్నే పంట భూమిగా తయారు చేసి రకరకాల ఔషధ మొక్కలు, పండ్లు, కూరగాయలు, పువ్వులు పండిస్తూ రైతాంగానికే ఆదర్శంగా నిలుస్తున్నారు కొత్తా పద్మావతి.. కులుకూరి రాజేశ్వరి. పెదగంట్యాడ మండలం నెల్లిముక్కులో నివసిస్తున్న కొత్తా పద్మావతి.. మండలంలోని బర్మాకాలనీలో ఉంటున్న కులుకూరి రాజేశ్వరి ఒక వైపు ఇంట్లో పనులతో బిజీగా ఉంటూనే.. మరో వైపు తమ ఇళ్ల పైభాగంలో రకరకాల పంటలు పండిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. కేవలం 107 గజాల్లో నిర్మించిన రెండు ఫ్లోర్ల భవనం పైభాగంలో మట్టి, పూలమొక్కలు వేసేందుకు అనువుగా తగిన రూపకల్పన చేశారు. దీనిలో భాగంగానే బంతి, చేమంతి, మందారం, గులాబీ, మల్లి వంటి రకరకాల పూలమొక్కలతో పాటు పోషకాలు అందించే సపోట, మల్బారీ, డ్రాగన్, స్వీట్ లెమన్, నిమ్మ, అంజీర్, రేగుపండ్లు వంటి పండ్ల మొక్కలు నాటారు. కాలీ ఫ్లవర్, మునక్కాయ, వంకాయ, ఆనపకాయ వంటి కూరగాయలతో పాటు ఔషధ గుణాల మొక్కలు అయిన రణపాల, నల్లేరు, నల్ల పసుపు, నిమ్మ గడ్డి, భృంగరాజ్, రుద్రాక్ష, కాఫీ, నల్ల పసుపు, పసుపు మొక్కలు పెంచుతున్నారు. ఆ మేడ మీద పూసే పూలు ఆ ప్రాంతానికే అందం తెస్తూ.. చూపరులను కళ్లు తిప్పుకోనీయకుండా చేస్తున్నాయి. వాటితో పాటు రకరకాల పండ్ల మొక్కలు నాటి వాటి వల్ల వచ్చే ఫలసాయాన్ని పలువురికి పంచుతూ అందరికీ బంధువులుగా మారుతున్నారు. ఒక చిన్న డాబాపై ఇన్ని రకాల పంటలు పండించడాన్ని చూసిన వారందరూ వారిని అభినందించకుండా ఉండలేకపోతున్నారు. కాగా తాము ఈ పంటలు పండించడానికి కారణాన్ని వెల్లడిస్తూ.. ప్రశాంతత కోసం మొదట్లో మొక్కలు నాటడం అలవాటు చేసుకున్నామని చెప్పారు. అదే ప్రవృత్తిగా పెట్టుకున్నామని తెలిపారు. తీరిక సమయంలో ఎక్కువ సమయాన్ని పంటల కోసమే వినియోగిస్తున్నామని.. నీళ్లు పోయడం.. మొక్కలకు పురుగు పట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు.. గోమూత్రం, నల్లబెల్లం, బాగా మగ్గిన అరటి పండ్లు, తరిగిన కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం కూడా ఎరువుగా తయారు చేసి మొక్కలకు వేస్తుంటామని వివరించారు. ఆకులు రాలితే శుభ్రం చేయడం వంటి పనుల్లో నిమగ్నమై ఉంటామన్నారు. ఇది తమకు ఎంతో తృప్తిని ఇస్తోందని పేర్కొన్నారు. పూలు, పండ్లు, కూరగాయలను తాము ఎప్పుడూ బయటి నుంచి తెచ్చుకున్నది లేదన్నారు. తాము పండించిన పంటలనే తాము వాడుకోవడంతో పాటు ఇరుగుపొరుగు వారికి, బంధువులకు, స్నేహితులకు ఇస్తున్నామని తెలిపారు.



రేగుపండ్లు



నెల్లిముక్కులో..

### మొక్కలే సర్వస్వం..



నేను మా వారు ఇద్దరం నిత్యం మొక్కలతోనే ఎక్కువ సమయం గడుపుతున్నాం. మాకు ఒక కుమార్తె ఉంది. ఆమెకు వివాహమైన తర్వాత.. మా వారు ఉద్యోగ విరమణ తర్వాత మొక్కలే మాకు సర్వస్వం అయ్యాయి. వాటిని సంరక్షించుకుంటున్నాం. మేము పండించుకునే పంటలను మేము వినియోగించుకోవడంతో పాటు ఇరుగు పొరుగు వారికి కూడా అందిస్తున్నాం. అందులోనే ఎంతో సంతృప్తి ఉంది. – కొత్తా పద్మావతి, నెలిముక్క

### మొక్కలంటే చాలా ఇష్టం..



నాకు చిన్నతనం నుంచి మొక్కలంటే చాలా ఇష్టం. ఇందులో ఔషధ గుణాల మొక్కలను ఎక్కువగా పెంచుతున్నాను. చిన్న పిల్లలకు వచ్చే అనారోగ్య సమస్యలతో పాటు పెద్దలకు అవసరమైన వాటిని అందిస్తున్నాను. రణపాల కిడ్నీలో రాళ్ల సమస్యను నివారిస్తుంది. రుద్రాక్ష, దుంప పసుపుతో దగ్గు, జలుబు తగ్గుతాయి. వీటిని నిత్యం అవసరమైన వారికి అందిస్తున్నాను.

– కులుకూరి రాజేశ్వరి, బర్మా కాలనీ

## వైభవంగా విజయ రాఘవ స్వామి పరస



పూజలందుకుంటున్న సీతారామ లక్ష్మణులు



పరసలో జనసందోహం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో శ్రీ విజయరాఘవ స్వామి పరస మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ విజయరాఘవ స్వామిని దర్శించుకున్నారు. పరస సందర్భంగా సాయంత్రం గ్రామంలోని వీధులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. పరసకు విచ్చేసిన వారితో గ్రామంలో రోడ్లు కిక్కిరిసిపోయాయి. పరసలో పలు రకాల వస్తువులతో స్టాళ్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, సాము గరిడీతో పాటు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



జనంతో రద్దీగా మారిన వీధులు

# పరసల హోరు

- కణితి, దిబ్బపాలెం, అగనంపూడి ప్రాంతాల్లో వేడుకగా తీర్థాలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న చిన్నాపెద్దా



కణితి రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య



కణితి గాంధీ బొమ్మ కూడలిలో తీర్థ మహోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85, 87 వార్డుల్లోని నిర్వాసిత కాలనీల్లో పరస మహోత్సవాలు జోరందుకున్నాయి. 87వ వార్డు కణితి గాంధీ బొమ్మ కూడలిలోని రామాలయంలో సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆలయంలో పూజలు చేశారు. తర్వాత ఆవరణలో తప్పెటగుళ్లు, సాముగరిడీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శంకరరావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీను, గొనప సన్యాసినాయుడు, బొండా గోవిందరాజులు, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

**దిబ్బపాలెంలో సీతారాముల తీర్థం..**

జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం నిర్వాసిత కాలనీలో సీతారాముల పరస ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారాములకు పూజలు చేశారు. సాయంత్రం పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చెట్టు భజనలు, సాము గరిడీలు, తోడపెద్ద, కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అగనంపూడి నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు శీరంశెట్టి బాబ్జి, యలమంచిలి అప్పారావు, గొల్లవిల్లి రామారావు, ఈగల నరసింగరావు, బుదిరెడ్డి చిన అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, పచ్చికోరు చిన్నారావు, దుల్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**జగన్నాథస్వామి పరస మహోత్సవం..**

జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలో పరస ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వాడ ఎస్ఐ డి.శ్రీనివాసరావు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు చెట్టు భజనలు, తోడపెద్దల భజన, సాము గరిడీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, ప్రతినిధులు గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నరపిని నాగమణి, కుసుమంచి కుమారి, వరదారాణి, గొల్లవిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



దిబ్బపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దిబ్బపాలెంలో కోలాటం ఆడుతున్న మహిళలు



అగనంపూడి జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో గరిడీ

## దయాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



దయాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తిప్పల దయాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి అన్నారు. తిప్పల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దయాల్‌రెడ్డి 19వ వర్ధంతి కార్యక్రమాన్ని గంగవరం పోర్టు వంతెన సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. దయాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిప్పల కుటుంబ సభ్యులు, రిటైర్డ్ డీసీపీ సురేష్‌కుమార్, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, ధర్మాల శ్రీను, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, పెద్దిరెడ్డి, తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మానుష్యంగా ప్రభుత్వ కార్యాలయాలు



నిర్మానుష్యంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం

గాజువాక: సంక్రాంతి పండగ నేపథ్యంలో గాజువాకలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. గురువారం పని దినమే అయినప్పటికీ ఉద్యోగులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. ప్రజలు కూడా ప్రభుత్వ కార్యాలయాలకు రాలేదు. వివిధ పనుల కోసం జీవీఎంసీ కార్యాలయానికి వచ్చే జనంతో నిత్యం రద్దీగా ఉండే గాజువాక జోనల్ కార్యాలయంలోని విభాగాలు పరిమిత సంఖ్యలో ఉద్యోగులతో ఖాళీగా కనిపించాయి. జనం రాకపోవడంతో ప్రాంగణం మొత్తం నిర్మానుష్యంగా మారింది. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. పండగ నేపథ్యంలో ఉద్యోగులు, అధికారులు అందుబాటులో ఉండే అవకాశం తక్కువగా ఉంటుందని భావించిన జనం కార్యాలయానికి రాలేదు. వచ్చే రెండు రోజుల్లోనూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది. పండగ వేళ గాజువాకలో దుకాణాలు పెద్దగా తెరుచుకోలేదు. దీంతో బ్యాచిలర్లు భోజనానికి ఇబ్బంది పడ్డారు.

### కోడి పందాలాడుతున్న ఆరుగురిపై కేసు

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి కూర్మన్నపాలెంలో కోడి పందాలు ఆడుతున్న ఆరుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంక్రాంతి నేపథ్యంలో మద్యం సేవించి వారు కోడి పందాలు ఆడుతున్నట్లు విచారణలో వెల్లడించడంతో వారి వద్ద నుంచి మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపారు.

### 56వ రోజుకు కార్మికుల నిరసనలు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో (ఎన్ఏడీ)లో విధుల్లో ఉన్న 36 మంది కార్మికుల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారానికి 56వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎన్ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యం చట్టసమ్మతం కాని విధంగా ఓవర్‌టైమ్ చేయించుకుంటోందని ఆరోపించారు. ఇప్పటికే 36మంది కార్మికులకు యాజమాన్యం చార్జిషీట్లు ఇచ్చిందని, దానికి తిరుగు సమాచారం కూడా ఇచ్చారని, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామ నాయకుడు స్వర్గీయ కాకి కుంచారావు జ్ఞాపకార్థం వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 250 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా వారిలో 14 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. గురువారం ఫైనల్స్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చింతల ఉమాదేవికి రూ.7,500, పిలకా ధాత్రికి రూ.7,500, ద్వితీయ స్థానంలో నిలిచిన ముదపాక ఐశ్వర్యకు రూ.5,000, భేరి భవానీకి రూ.5,000, తృతీయ స్థానంలో నిలిచిన కించంగి హైమావతికి రూ.5,000 నగదు బహుమతిని కార్పొరేటర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం నాయకులు కొల్లి అప్పలరెడ్డి, పెట్ల అర్జునరావు, నావాన సింహాచలం, నావాన వెంకట అప్పారావు, కొల్లి కుంచారావు, పాలవలస మణిరావు, దూడ పాపారావు, గిడితూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ తదితరులు

అగనంపూడి: వచ్చేనెల 6వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు శ్రీకాకుళంలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ ఆవిష్కరించారు. కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాల సాధన కోసం దేశ వ్యాప్తంగా ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలపై యువతలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తుందని, నిరుద్యోగ యువత కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, నాయకులు జి.ఆనంద్, కిరణ్, లక్ష్మి, రజని, ఉమ తదితరులు పాల్గొన్నారు.